ఉత్సాహంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమం

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాలలోని నిమ్మగడ్డ ఫౌండేషన్ జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుభ తిథి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి భార్గవి, ఎంఈఓలు కె.శ్రీనివాస రావు, కె.లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ కార్యక్రమం అమలులో భాగంగా సోమవారం తిథి భోజన కార్యక్రమాన్ని దాతలు చుండూరు భాస్కరరావు వితరణతో ప్రభుత్వం వారు అందజేస్తున్న మధ్యాహ్న భోజనానికి అదనంగా అరటిపండ్లు, పెరుగు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్ పర్సన్ పులివర్తి పద్మ, ఉపాధ్యాయులు శాంతి స్నేహలత, వసంత లక్ష్మి, బాంధవి, విజయలక్ష్మి, పూర్ణ చంద్రావతి, హైమావతి, హేమలత, సతీష్‌బాబు, రాంబాబు, రవీంద్రబాబు, అజయ్‌కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిలో....

తాడేపల్లి పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుభతిథి భోజనాలు ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ


శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనాన్ని స్వీకరిస్తున్న అధికారులు

అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొని పాఠశాల వ్యవస్థాపకులు దివంగత దొంతిరెడ్డి అంజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి విద్యార్థులకు స్వీట్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనానికి అదనంగా శుభతిథి భోజన కార్యక్రమానికి విద్యాదాత, వైఎస్సార్‌సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి విద్యార్థులకు స్వీట్స్, హాట్ అందజేశారని తెలిపారు.

ముగిసిన శిక్ష సప్తాహ్ కార్యక్రమాలు

మంగళగిరి: ప్రభుత్వ పాఠశాలలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ్ కార్యక్రమాలు సోమ వారం ముగిశాయి. ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 22వ తేదీ నుంచి 29 వ తేదీ వరకు శిక్ష సప్తాహ్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పలు


దొంతిరెడ్డి అంజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు ఉపాధ్యాయులు

కార్యక్రమాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంహపంక్తి భోజనం చేసి పాఠశాలలో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఫిరంగిపురం: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నట్లు ఎంఈవో రవికాంత్ అన్నారు. గ్రామంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులతో సహపంక్తి భోజనం కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో భాగంగా 627 మంది విద్యార్థులకు భోజనంతో పాటు కేసరి తీపి పదార్థాన్ని ఆయన వడ్డించారు. ఆయనతోపాటు మండవ నరసింహారావు, సుపీరియర్ సిస్టర్ డాక్టర్ ఏరువ, విన్సీపాల్, పాఠశాల హెడ్ మిస్ట్రెస్ సిస్టర్ ఒట్టి, థెరేసమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నుదురుపాడులో గ్రామంలోని ఎంపీపీ హెచ్‌ఈ పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్ షేక్. మస్తాన్‌వలి విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభావంతులైన


పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రవికాంత్

ఉపాధ్యాయులచే ప్రభుత్వపాఠశాలల్లో విద్యాబోధన జరుగుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఏవీవీ లక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో చలపతి విద్యార్థులు

తాడికొండ: సామాజిక సేవలో మేము సైతం అంటూ మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల టెక్నోక్రాట్స్ స్టూడెంట్ అసోసియేషన్ విద్యార్థులు ముందడుగు వేస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ సేవా శాంతి ఆశ్రమం, పట్టణ పేద నిరాశ్రయుల ఆశ్రమంలో తమ సేవలందించారు. వృద్ధులకు పండ్లు, స్వీట్లు, భోజనం సమకూర్చి తమ సేవా నిరతిని చాటుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అలవర్చుకోవడం హర్షణీయమన్నారు. డీన్ పి.ఫణికుమార్ సీఎస్‌ఈ విభాగాధిపతి


సాయం అందిస్తున్న చలపతి విద్యార్థులు

జి.రామచంద్రరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ అందజేత



మంగళగిరి: ఇందిరానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు దాతలు వాటర్ ప్యూరి ఫైయర్ అందజేశారు. పిల్లలకు శుభ్రమైన తాగునీటి అందించాలని శ్యామసుందరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ప్యూర్ ట్రస్ట్ నిర్వాహకులు అందజేయగా ఎంఈఓ సత్యనారాయణ హాజరై పాఠశాలకు అందించారు.

గ్యాస్‌పొయ్యి...

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ ప్రాతూరు ఎ.ఎ. పాఠశాలకు టీడీపీ నాయకులు సోమవారం గ్యాస్‌పొయ్యిని అందజేశారు. గత కొంతకాలంగా పాఠశాలలో పొయ్యి పనిచేయకపోవడంతో విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు గ్యాస్ పొయ్యిని అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వంగా దీపలత పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లను పునరుద్ధరించాలి



మంగళగిరి: బెస్ట్ అవెల్ బుల్ స్కూళ్లను పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం రామారావు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విద్యనందించే బెస్ట్ అవెల్ బుల్ స్కూళ్లను పునరుద్ధరించాలని కోరుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం మూడో రోజుకు చేరాయి. రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లను పునరుద్ధరించి వెంటనే ఎస్సీ, ఎస్టీ పిల్లలకు విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు బొంతు రవి కుమార్, కుపుమ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తండ్రికి అప్పగింత



మంగళగిరి: ఓ బాలుడు తప్పిపోయి పోలీసులకు దొరకగా బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు సోమవారం అప్పగించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన నెమలికంటి సుధాకర్ దంపతుల తనయుడు ఆనందరావు తాడికొండలోని గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఆనందరావు సోమవారం ఉదయం కాజ టోల్‌గేట్ వద్ద ఒంటరిగా తిరుగుతుండగా మొబైల్ పోలీసు వాహనంలోని సిబ్బంది గమనించి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ సి.హెచ్.వెంకటేశ్వరరావు చేరుకుని బాలుడిని స్టేషన్‌కు తరలించి పూర్తి వివరాలు తెలియకపోవడంతో ఎస్ఐ సోషల్ మీడియ గ్రూపులలోను బాలుడి ఆచూకీ తెలపాలని కోరారు. ఆనందరావు తండ్రి సుధాకర్ స్టేషన్‌కు చేరుకుని వివరాలు తెలపడంతో బాలుడిని సుధాకర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సుధాకర్ కుటుంబ సభ్యులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

భూ వివరాల కోసం వినతి



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని విశాలాక్ష్మీ, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ భూమిలో మూడు ఎకరాలు అన్యాక్రాంతమైంది. దానికి సంబంధించిన పూర్తి వివరాలు ఆర్‌టీఐ సెక్షన్ ద్వారా తెలియజేయాలని కోరుతూ టి. బ్రహ్మారెడ్డి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ డీటీ రాజారమేష్‌కు వినతి పత్రం అందజేశారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలిరూరల్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా శాంతి ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాలయాల్లో వృద్ధులకు సోమవారం ఆహారం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. తాడికొండ మండలం మోతడకలోని చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు సేవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగశ్రీనివాసరావు, డీన్ పి.ఫణికుమార్, సీఎస్‌ఈ విభాగాధిపతి జి. రామచంద్రరావు పాల్గొన్నారు.

జెండర్ సెన్సిటైజేషన్‌తోనే అభివృద్ధి సాధ్యం

డాక్టర్ ఎ. వీరరాఘవరావు

తాడేపల్లిరూరల్: సమాజంలో సమానత్వం, గౌరవాన్ని పెంపొందించడంలో జెండర్ సెన్సిటైజేషన్ ఒక కీలకమైన ప్రయత్నమని గుంటూరు అత్మూరి వెంకటలక్ష్మి ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఎ.వీరరాఘవరావు అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో స్పృహస్తి ఫౌండేషన్ సహకారంతో సోమవారం జెండర్ సెన్సిటైజేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీర రాఘవరావు మాట్లాడుతూ గుర్తింపు, పాత్రల సంక్లిష్టతలను గురించి వ్యక్తులకు అవగాహన కల్పించడంతో పాటు సమాజంలో ఎప్పటి నుండో పాతుకుపోయిన మూస పద్ధతులకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. ఆడ, మగ అనే భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ గౌరవంగా, న్యాయంగా వ్యవహరించే వాతావరణాన్ని ప్రోత్సహించాలని కోరారు. లింగ పక్షపాతాల గురించి సంభాషణలలో చురుకుగా పాల్గొనడం, అందరికీ కలుపుకుని ఉన్న అభ్యాసాల కోసం వాదించడం


డాక్టర్ ఎ. వీరరాఘవరావును సత్కరిస్తున్న కేఎల్‌యూ డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్

ద్వారా, తాము వివక్షతతో కూడి నిబంధనలను తొలగించి సమానమైన సమాజాన్ని సృష్టించగలమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య, కో కన్వీనర్ ఎస్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

3న మారియమ్మ పెరియమ్మ తిరునాళ్ల

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని వెంకటసాయి క్వారీవద్ద కొలువై ఉన్న మారియమ్మ పెరియమ్మ 14వ తిరునాళ్ల వచ్చేనెల 3న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఉదయమే అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి కుంకుమపూజలు చేస్తారని చెప్పారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మకు బోనాలు నివేదిస్తారన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన తాడికొండ తహసీల్దార్



తాడికొండ: తాడికొండ తహసీల్దార్‌గా కె.నాసరయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ కాకుమను ప్రసాద్, ఆర్ ఐ శర్మ, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

గ్రీవెన్స్‌లో 12 అర్జీలు

తెనాలిరూరల్: తెనాలి తహసీల్దార్, పురపాలక సంఘ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 12 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి రెండు, ఎంపీడీఓకు సంబంధించి రెండు, పురపాలక సంఘానికి సంబంధించి ఒకటి, పోలీసు శాఖకు సంబంధించి ఒకటి ఉన్నాయి. అలానే పురపాలక సంఘంలో కమిషనర్ శేషన్న గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. టౌన్ ప్లానింగ్ విభాగానిక సంబంధించి రెండు, హెల్త్ సెక్షన్‌కు సంబంధించి ఒకటి, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మూడు అర్జీలు వచ్చాయి. వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

విద్యావనరుల కార్యాలయంలో చోరీ

ప్రత్తిపాడు: మండల విద్యావనరుల కార్యాలయంలో చోరీ జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మండల విద్యావనరుల కార్యాలయానికి శనివారం సాయంత్రం కార్యాలయ సిబ్బంది ఎప్పటిలానే తాళాలు వేసి వెళ్లిపోయారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం కార్యాలయ అటెండర్ రేణుక ఆఫీసుకు వచ్చారు. అప్పటికే కార్యాలయ ప్రధాన ద్వారంతో పాటు ఎంఈవో–1 గదికి ఉన్న తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే విషయాన్ని ఎంఈవో సీహెచ్ రమాదేవికి ఫోన్ ద్వారా తెలియజేశారు. వారు వచ్చి పరిశీలించగా హాల్‌లో ఉండాల్సిన 43 ఇంచెస్ ఎల్‌ఈడీ స్మార్ట్ టీవీని ఆగంతకులు అపహరించుకుపోయినట్లుగా గుర్తించారు. దీంతో ఎంఈవో రమాదేవి ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలికి


కార్యాలయంలో దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీసులు.. ఆగంతకులు పగలగొట్టిన తాళం (ఇన్‌సెట్‌లో)

చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కాగా ఇదే కార్యాలయంలో గతంలోనూ గుర్తు తెలియని వ్యక్తులు బ్యాటరీలు, ఇన్వర్టర్లను దొంగిలించారు.

అపూర్వ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం శ్రీరామకృష్ణ హైస్కూల్‌లో పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం సోమవారం ప్రాతూరు రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 1987 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సుమారు 60 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను తలచుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహించామని, 37 సంవత్సరాల కిందటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పూర్వవిద్యార్థులు దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, చందు, మస్తాన్, రఘు, ఉదయలక్ష్మి తదితరుల ఆధ్వర్యంలో జరిగింది.

సమయపాలనే విజయానికి సోపానం

మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: అవకాశం వచ్చినపుడు తగిన టాలెంట్‌ను ప్రదర్శించే వారే సక్సెస్ కాగలరని ఏఎస్‌ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక ఏఎస్‌ఎన్ డిగ్రీ కాలేజీలో 'బ్రేక్ ది ప్రొక్రాస్టినేషన్' పేరుతో వారానికి 105 గంటల ఛాలెంజ్ ప్రోగ్రాంను నిర్వహించారు. 530 మంది విద్యార్థులకుగాను 286 మంది వందకన్నా ఎక్కువ గంటల సాధించారు. వీరికి సర్టిఫికెట్ల ప్రదానోత్సవాన్ని సోమవారం సాయంత్రం కాలేజీ సెమినార్ హాలులో ఏర్పాటు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి శివకుమార్ మాట్లాడుతూ, జీవితం ఎవరికీ వడ్డించిన విస్తరి కాదనీ, డబ్బు కలిగిఉండటంతోనే అన్నీ ఉన్నట్టు కాదని గుర్తుచేశారు. ఫెయిల్యూర్స్‌కు బెంబేలెత్తి పోకూడదన్నారు. ఫెయిల్యూర్స్ నుంచి, పరిస్థితుల నుంచి పాఠాలను నేర్చుకోవాలని కోరారు. జీవన కళలు, భావవ్యక్తీకరణ శిక్షణ ఇందుకు


విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

బాగా ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, ఉత్తమమైన మానవ వనరులు కలిగిన సంస్థ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రతిభ ఉండటమే కాకుండా, విధుల నిర్వహణలో సమయపాలన మరింత ముఖ్యమని అన్నారు. విద్యార్థులకు సమయపాలన అలవరిచేందుకు నిర్వహించిన రోజులో 15 గంటల ఛాలెంజ్‌ను అత్యధిక మంది విద్యార్థులు గెలవటం సంతోషంగా ఉందన్నారు.

ఉన్నత విద్యనభ్యసించడం లక్ష్యం కావాలి


పండ్లు పంపిణీ చేస్తున్న మానవత బాధ్యులు


విద్యార్థులు తలిదండ్రులకు ఆహారం అందజేస్తున్న వెంకటపూర్ణచంద్

మానవత చైర్మన్ కొలసాని రామ్‌చంద్

తెనాలి: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలోని 450 మంది విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'శుభ భోజన్ దిన్'ను నిర్వహించారు. మధ్యాహ్న భోజనం సమయంలో మానవత బాధ్యులు విద్యార్థులకి పండ్లు పంపిణీ చేశారు. అమ్మ హాస్పిటల్ అధినేత డాక్టర్ జె.శివప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సంస్థ, తెనాలి చైర్మన్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఉపాధ్యాయులు ఉంటారనీ, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత విద్యలు అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో డీవీ సోమయ్య శాస్త్రి, కన్వీనర్ తన్నీరు శ్రీనివాసబాబు, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కటకం ప్రసాద్, సెక్రటరీ పి.వెంకట్, వైస్ ప్రెసిడెంట్ పరిమి శ్రీనివాస్, మహిళ విభాగం అధ్యక్షురాలు కళ్యాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదరావూరు హైస్కూలులో తిథి భోజనం

తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూలులో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో చివరిరోజైన సోమవారం తిథి భోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భోజనం ఏర్పాటు చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, మిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర వెంకటపూర్ణచంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భోజనంతో పాటు స్వీట్లు సమకూర్చారు. విద్యార్థులు తయారు చేసిన బోధనాభ్యాస సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు పి.సరళ, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

చిన్న సినిమాల విడుదలకు సదవకాశం

- తెలంగాణలో పర్సంటేజ్ విధానం
- ఆంధ్రలోనూ అమలు చేయాలి
- 'మా-ఏపీ' వ్యవస్థాపకుడు దిలీప్ రాజా

తెనాలి: తెలంగాణలో ఆగస్టు 2వ తేదీ నుంచి థియేటర్లలో సినిమాల ప్రదర్శనకు పర్సంటేజీ విధానం ఆచరణలోకి వస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లోనూ ఇదే పద్ధతిని అమలు చేయాలని 'మా-ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరో సినీదర్శకుడు అచ్చన శ్రీనివాసయాదవ్‌తో కలసి సోమవారం స్థానిక 'మా-ఏపీ' 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో మాదిరిగా థియేటర్లకు అద్దె చెల్లించకుండా పర్సంటేజీ పద్ధతి అమల్లోకి వస్తే, చిన్న సినిమా నిర్మాతలకు ఎంతో ఉపయోగమన్నారు. వెంటిలేటర్ పై ఉన్న థియేటర్లు బతుకుతాయని అన్నారు. గ్లోబల్ ఫిలింస్ సునీల్ నారంగ్, ఎస్వీ క్రియేషన్స్ శిరీష్‌రెడ్డి దగ్గర హైదరాబాద్‌లో ఏవిధంగా అగ్రిమెంట్లు జరుగుతున్నాయో అలాగే, అగ్రిమెంట్లును


మాట్లాడుతున్న దిలీప్‌రాజా

రూపొందించుకోవాల్సిందిగా ఆంధ్రకు చెందిన చిన్న నిర్మాతలకు ఆయన సూచించారు. దయచేసి ఖాళీ అగ్రిమెంట్లను ఎవరూ ఇచ్చి రావద్దని చెప్పారు.

సినీదర్శకుడు అచ్చన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ భారత దేశంలోని అన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లకు పర్సంటేజీ విధానంలో షేర్ వస్తుందని, ఏపీలో థియేటర్ల యాజమాన్యం, కంట్రోలర్ అసోసియేషన్ సహకరించాలని కోరారు. వీరితో కో-డైరెక్టర్ ఇంటూరి విజయభాస్కర్, సిద్దెల మనోహర్ ఉన్నారు.

ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశాలకు డాక్టర్ ఈమని

తెనాలి: భారత ప్రభుత్వ ఆతిథ్యంలో దేశరాజధాని ఢిల్లీలో 195 దేశాలు పాల్గొంటున్న 46వ ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశాలకు తెనాలికి చెందిన పురావస్తు పరిశోధకుడు, వారసత్వ పరిరక్షణ నిపుణుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి హాజరయ్యారు. ప్రస్తుతం తెలంగాణాలోని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ బాధ్యతల్లో ఉన్న అయన్ను ఆ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అతిథిగా ఈ సమావేశాలకు నామినేట్ చేసింది. ఢిల్లీలోని భారత మండపంలో రెండురోజులపాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. యునెస్కో సభ్యదేశాలు, తమ దేశాలకు చెందిన పురాతన స్థలాలు, కట్టడాలు, సుందర ప్రకృతి ప్రదేశాలకు ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు కోసం పంపే ప్రతిపాదనలను ఈ సమావేశాల్లో చర్చిస్తారని డాక్టర్ శివనాగిరెడ్డి తెలిపారు. అప్పటికే


డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకొన్న వాటిపై ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని, ఆసక్తికరంగా సాగే చర్చల ద్వారా, కొత్త ప్రతిపాదనల నివేదికల తయారీకి అవసరమైన నైపుణ్యాన్ని సంతరించుకొనే వీలు చిక్కిందని వివరించారు. తనతో పాటు వారసత్వ నిపుణులు, వాస్తు శిల్పులు(ఆర్కిటెక్టులు) మణికొండ వేదకుమార్, ఎం.పాండురంగరావు, డాక్టర్ శోభా, ప్రొఫెసర్ కేపీ రావు, డాక్టర్ పద్మనాభలను తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేసిందని, అవకాశమిచ్చిన తెలంగాణ ప్రభుత్వ పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శికి, ప్రభుత్వానికి శివనాగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

శుభ్రమైన నీటినే తాగాలి



తెనాలిరూరల్: ప్రజలు శుద్ధి చేసిన నీటినే తాగాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణ 30వ వార్డులోని అమరావతి ప్లాట్స్‌లో పురపాలక సిబ్బంది నీటి నమూనాలను సోమవారం సేకరించారు. కమిషనర్ నీటిని నమూనాలను పరిశీలించడంతో పాటు నీటిని తాగి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో రక్షిత తాగునీటిని అందిస్తున్నామని చెప్పారు. బోర్ల నీరు వినియోగించే వారు నీటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలానే 29వ వార్డులో మార్కెట్ యార్డు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, అన్న క్యాంటీన్ల వద్ద పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు.